9న ఫాసీ లైసెన్స్ అండ్ రిజిస్ట్రేషన్ మేళా

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఈనెల 9వ తేదీన ఉదయం 10 నుంచి ఆహార వ్యాపారదారులకు ఫాసీ(ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) లైసెన్స్ అండ్ రిజిస్ట్రేషన్ మేళా నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ రవికిరణ్ తెలిపారు. జోనల్ పరిధిలో ఆహార వ్యాపారులందరూ తప్పనిసరిగ్గా ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలని లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఫుడ్ లైసెన్స్ పొందడానికి కావాల్సిన పత్రాలు ఇతర అంశాలపై ఈ మేళాలో అవగాహన కల్పిస్తామన్నారు. సరైన అర్హులందరికీ తక్షణమే లైసెన్స్ ఇస్తామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వర రావు, వినోద్‌కుమార్ తెలిపారు. బ్రాహ్మణ్ హాస్టల్, శివాలయం, ఆదర్శ్‌నగర్, జగదీశ్‌మార్కెట్ పరిధుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, కమలానగర్, మధురానగర్, ఎస్‌కేఎంఎస్, సత్యం కంప్యూటర్స్, అవంతినగర్ పరిధుల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

9న దేశవ్యాప్త కార్మిక సమ్మెకు ఐద్వా మద్దతు



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి తదితరులు

నల్లకుంట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న చేస్తున్న దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌కు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అంబానీ, ఆదానీల వంటి ప్రైవేట్ సంస్థలకు కేంద్రం అమ్మివేస్తున్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి, సహాయ కార్యదర్శి కె.ఎస్.ఆషాలత తదితరులు పాల్గొన్నారు.

10న సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుక

చిక్కడపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలను ఈనెల 10న బాగ్‌లింగంపల్లి సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక వైస్‌చైర్మన్ పెద్దోల్ల గంగారెడ్డి, ప్రధానకార్యదర్శి ఎస్.ధర్మరాజుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా చందనాభిషేకం, సామూహిక సాయివ్రతం, 3వేల మందికి అన్నదానం, సాయంత్రం పల్లకీసేవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

10న సచివాలయ ముట్టడి : ఆమ్‌ఆద్మీపార్టీ

కవాడిగూడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 10వ తేదీన సచివాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. హైదరాబాద్ దోమలగూడలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆప్ పార్టీ రాష్ట్ర నాయకులు బుర్రారాముగౌడ్, మహ్మద్ మాజిద్, నర్సింగ్, యమునాగౌడ్, విజయ్, శివాజీ, దర్శనం రమేష్, మౌనిక, ధర్మేంద్ర, తదితరులతో కలిసి చలో సచివాలయ ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఆప్ నాయకులు కార్యకర్తలతో పాటు విద్యార్థి సంఘాల నేతలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.


దేవాదాయశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దేవాలయ భక్త సమాజం అధ్యక్షుడు రవీందర్, బీజేపీ నేతలు, భక్తులు

కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద భక్తులకు శాశ్వత షెడ్లు ఏర్పాటు చేయాలి

కవాడిగూడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్ట మైసమ్మ దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం శాశ్వత షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కట్టమైసమ్మ దేవాలయ భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ టి రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్‌కు భక్తులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ ఎం.రమేష్‌రాం, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బర్కత్‌పుర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): డెంగీ పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. వర్షాకాలంలో రోడ్లపై మురికినీరు నిలువడం వల్ల దోమలు వృద్ధి చెందే ప్రమాదం ఉందన్నారు. సోమవారం డివిజన్‌లోని చప్పల్‌బజార్, ఇందిరానగర్ బస్తీలలో జీహెచ్ఎంసీ ఎండమాలజీస్ట్ ఆధ్వర్యంలో డెంగీ ఫీవర్‌పై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు రక్త, బీపీ షుగర్, జ్వరం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోష్, సునీతారెడ్డి, ఇందిర, సబిత, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు మల్లికార్జున్, రమాదేవి, సత్యనారాయణ, భీమ్‌రాజ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు


మాట్లాడుతున్న అంబర్‌పేట క్లస్టర్ డాక్టర్ పద్మజ

ముషీరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అంబర్‌పేట క్లస్టర్, ఎస్‌పీహెచ్‌వో డాక్టర్ పద్మజ తెలిపారు. సోమవారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో అంబర్‌పేట క్లస్టర్ పరిధిలోని ఆరు యూపీహెచ్‌సీలు, 12 బస్తీ దవాఖానాల వైద్యులు, పీహెచ్‌ఎన్‌లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ పద్మజ మాట్లాడుతూ... వర్షాకాలం సందర్భంగా విషజ్వరాలు, డైయేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్‌సీడీ, ఫీవర్, డెంగీ వ్యాధులను గుర్తించేందుకు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. యూపీహెచ్‌సీ కేంద్రాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై ప్రజల్లో మరింతవిశ్వాసం పెరిగేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి, డాక్టర్లు దీప్తిపటేల్, కౌసర్, హాసిని, మౌనిక, హరిశ్రీ, శివ, పీహెచ్‌ఎన్‌లు ఫెల్లీస్, శ్యామల పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

● విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి ● కలెక్టర్ హరిచందన


జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ హరిచందన, సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి తదితరులు

కవాడిగూడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంవైపు నడవాలని, సమయం చాలా విలువైందని, వృథా చేసుకోవద్దని కలెక్టర్ హరిచందన పిలుపునిచ్చారు. సోమవారం దోమలగూడలోని ఏవీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాదక ద్రవ్యాలతో జరిగే నష్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ డ్రగ్స్ తాత్కాలిక ఆనందాన్ని కలిగించవచ్చుకాని, దీర్ఘకాలికంగా ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని అన్నారు. సెంట్రల్ జోన్‌డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ ప్రస్తుత ఉరుకు పరుగుల జీవితంలో విద్యార్థులకు మంచి, చెడులు చెప్పే కుటుంబీకులు తగ్గిపోయారని ఆవేదనవ్యక్తం చేశారు. సోషల్ మీడియా వాడకం విపరీతంగా పెరిగిపోయిందని దీనిపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ సెంట్రల్ బ్యూరో అధికారి ఆశిష్ చక్రవర్తి, కళాశాల పీజీ డైరెక్టర్ డాక్టర్ గోపీకృష్ణ, గాంధీనగర్ ఏసీపీ ఎ.యాదగిరి, దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ రాజలింగం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మ, యాంటీ డ్రగ్ కమిటీ కోకన్వీనర్ రిషితారెడ్డి, కళాశాల విద్యార్థులు, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ హక్కుల ఉద్యమంగా ఎమ్మార్పీఎస్

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అణచివేత నుంచి ఆవిర్భవించి.. కుల ఉద్యమంగా మొదలై మానవ హక్కుల ఉద్యమంగా అవతరించింది ఎమ్మార్పీఎస్ అని ఐఆర్‌టీఎస్ రిటైర్డ్ అధికారి అప్పికట్ల భరత్‌భూషణ్ పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సమావేశం బంధు సొసైటీ అధ్యక్షుడు వీరస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మాదిగ దండోరా పిడికెడు మందితో 1994 జూలై 7న ఏపీ ప్రకాశం జిల్లాలోని ఈదముడి గ్రామంలో ప్రారంభమైందన్నారు. ఈ పోరాటంలో మందకృష్ణ మాదిగ పోరాటం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పాలెపోంగు ముత్తయ్య, ప్రొఫెసర్ నథానియేల్ తదితరులు పాల్గొన్నారు.

సామాజికన్యాయం, రాజ్యాధికారమే లక్ష్యం

చిక్కడపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): సామాజికన్యాయం, రాజ్యాధికారం లక్ష్యంగా పద్మశ్రీ మందకృష్ణమాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ కృషిచేస్తుందని ముషీరాబాద్ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్‌మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా సోమవారం గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్ లింక్‌బ్రిడ్జి వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో గండి కృష్ణమాదిగ, పాపిడి రాజుమాదిగ, చిలక ఎల్లయ్యమాదిగ, నక్క రామారావు, అమ్మగూడు దశరథ్, వినాయకరావు, రమేష్, వెంకటయ్య, నాగరాజు, నర్సింగరావు, సాయిలు, విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గౌడల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తా : వీహెచ్


మాజీ ఎంపీ వి.హనుమంతరావును సత్కరిస్తున్న అంబర్‌పేట గౌడ సంఘం నూతన ప్రధానకార్యదర్శి కృష్ణగౌడ్ తదితరులు

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గౌడల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వపరంగా కృషిచేస్తానని మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేర్కొన్నారు. గౌడలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పార్టీ, నామినేటెడ్ పదవులలో తగిన అవకాశాల కల్పనకు కృషి చేస్తానన్నారు. అంబర్‌పేట గౌడ సంఘం నూతన కమిటీ సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. సంఘం నూతన ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ సోమవారం వీహెచ్‌ను ఆయన నివాసంలో కలిసి సంఘం పక్షాన సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఆఫ్సర్ యూసఫ్ జాహీ, నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్; నారాయణస్వామి, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, శ్రీమంత్‌గిరి, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి


సమావేశంలో అభివాదం చేస్తున్న సుధాకర్, సుల్తాన్ యాదగిరి తదితరులు

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నాడు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు చెరుకు సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎక్కువగా పాల్గొన్నారని అన్నారు. జేఏసీ ప్రధానకార్యదర్శి బత్తుల సోమయ్య మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమానికి గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యాదగిరి, రామారావు, పద్మ, ఫక్రుద్దీన్, చారి, సుధాకర్, యువరాజ్, మల్లేష్, పరశురాములు, అరుణ, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నూతన కార్యవర్గం

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నూతనకార్యవర్గాన్ని ప్రకటించారు. చైర్మన్‌గా సుల్తాన్ యాదగిరి, రాష్ట్ర ప్రధానకార్యదర్శులుగా సోమయ్య, క్రిష్టఫర్, ఉపాధ్యక్షురాలిగా పద్మ, కార్యదర్శి ఎస్.డి.రషీద్‌లను ప్రకటించారు. విద్యార్థివిభాగం అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్, మహిళావిభాగం అధ్యక్షురాలిగా మాధవరెడ్డి, కార్యదర్శి అంజలిదేవీని నియమించారు.

వివిధ భాషల్లో ఇనాక్ సాహిత్యం అనువాదం కావాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ సత్యనారాయణప్రసాద్ తదితరులు

చిక్కడపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వివిధ బాషల్లో కొలకలూరి ఇనాక్ సాహిత్యం అనువాదమైతే తెలుగు బాష ఔన్నత్యం ఇతర బాషల వారికి తెలుస్తుందని తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య వి.నిత్యానందరావు అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇనాక్ సాహితీ సప్తాహం ముగింపు సభ సోమవారం సాయంత్రం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పాటిబండ్ల సత్యనారాయణప్రసాద్ ఈసందర్భంగా ప్రముఖ అనువాదకులు ఆచార్య టి.ఎస్ఆర్ కృష్ణమూర్తి రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ నాటకం తిరుప్పాళ్ ఆళ్వార్ జీవిత చరిత్ర సంస్కృతభాష అనువాద గ్రంథం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంరోజులపాటు తెలుగు సాహితీవేత్త ఇనాక్ సాహిత్యాన్ని విశదీకరణ కోసం సమావేశాలు నిర్వహించడం అరుదు అన్నారు. ప్రముఖ విమర్శకులు దారా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దళితులను నిషేధించిన సంస్కృత భాషలోకి ఇనాక్ నాటకం అనువాదం కావడం విశేషమన్నారు. కవి డా.ప్రభాకర్, నాట్యగురువు జ్వాలాముఖి పాల్గొన్నారు. అనంతరం జ్వాలాముఖి శిష్యబృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు.

జనావాసాల మధ్య ప్లాస్టిక్, ఐరన్ స్క్రాప్ దుకాణాలు

నిత్యం ప్రమాదాలు, ఇబ్బంది పడుతున్న ప్రజలు


సాయినగర్‌లో జనావాసాల మధ్య స్క్రాప్ దుకాణాలు

ముషీరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో జనావాసాల మధ్య ఎలాంటి అనుమతులూ లేకుండా ప్లాస్టిక్, స్క్రాప్ దుకాణాలు కొనసాగుతున్నాయి. వీటివల్ల శబ్ద, వాయు కాలుష్యాలు ఏర్పడటంతోపాటు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి స్క్రాప్‌ను తీసుకొచ్చి రోడ్లపైనే నిలువ చేయడం వల్ల రాకపోకలకు సైతం ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇటీవల అంజయ్యనగర్ సమీపంలోని సాయినగర్‌లో ప్లాస్టిక్ గోదాములో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. వేడి, మంటల వల్ల చుట్టుపక్కల ఇండ్లు పాక్షికంగా ధ్వంసం అయ్యాయి. రసాయనాలతో కూడిన ఐరన్ బాక్స్‌ను కట్ చేస్తుండగా కార్మికుడికి తీవ్ర గాయాలై గాంధీ ఆసుపత్రిలో చేరి మృత్యువాత పడ్డాడు. ఇలాంటి ఘటనలు నిత్యం చోటు చేసుకుంటుండడంతో సాయినగర్‌వాసులు జీహెచ్ఎంసీ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి స్థానికంగా ఉన్న కొన్ని షాపులను పోలీసు బందోబస్తు మధ్య సీజ్ చేశారు. కొద్దిరోజులు షాపులను మూసివేసినప్పటికీ మళ్లీ వాటిని ప్రారంభించి యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి జనావాసాల మధ్య ఉన్న ప్లాస్టిక్, ఐరన్ స్క్రాప్ దుకాణాలు, గోదాములను నగర శివారుకు తరలించాలని డిమాండ్ చేశారు.

లోతట్టు ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలి


వైభవ్‌నగర్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ వెంకటరెడ్డి తదితరులు

నల్లకుంట, జూలై 7(ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పలు లోతట్టు ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సమస్యపై ఎప్పటికప్పుడు జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. డివిజన్‌లోని వైభవ్‌నగర్‌లో వర్షం పడిన సమయంలో వరదనీరుతో డ్రైనేజీలు నిండిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె సోమవారం ఆ ప్రాంతాన్ని సందర్శించి, సమస్యలను పరిశీలించారు. ఈ సమస్యలపై శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రశాంతి, ఏఈ పృథ్వీ, జలమండలి మేనేజరు మహ్మద్ మాజీద్, హెల్త్ ఆఫీసర్ ఏఎంహెచ్‌వో హేమలత, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, ఎస్ఎఫ్ఏ మహ్మద్ ఆదిల్, సూపర్‌వైజర్ యాదగిరి, కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, భరత్‌గౌడ్‌ను కలిసిన బాల్‌రాజ్‌గౌడ్

పేదల సంక్షేమానికి కేంద్రం కృషి: కిషన్‌రెడ్డి

చిక్కడపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి కేంద్రం కృషి చేస్తోందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదర్శ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ వంగాల బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఓబీసీల జనాభా దామాషా ప్రకారం దేశస్థాయిలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి జనగణనతోపాటు కులగణన కూడా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి.జైపాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కనీస వేతనాలను సవరించండి


కార్మికమంత్రి వివేక్‌ను కలిసిన ఐఎన్‌టీయూసీ నేత భిక్షపతి

చిక్కడపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కార్మికుల కనీసవేతనాలను సవరించాలని కోరుతూ ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకుడు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవసాని భిక్షపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి జి.వివేక్‌వెంకటస్వామిని కోరారు. 19 సంవత్సరాలుగా కార్మికుల కనీస వేతనాలు సవరించకపోవడంవల్ల రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు అనేక ఇక్కట్లను ఎదుర్కొంటున్నారని మంత్రికి వివరించినట్లు భిక్షపతి తెలిపారు. 2021 జూన్‌లో విడుదల చేసిన 21 నుంచి 25 జీవోలను వెంటనే గెజిట్‌లో ప్రచురించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని భిక్షపతి తెలిపారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి


మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పూలబొకే ఇస్తున్న గిడియోన్‌బాబు

చిక్కడపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆలిండియా క్రిష్టియన్ ఫెడరేషన్(ఏఐసీఎఫ్) తెలంగాణరాష్ట్ర అధ్యక్షుడు ఏకే గిడియోన్‌బాబు తెలిపారు. అధ్యక్షుడిగా ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా సోమవారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలో విలేకరులతో మాట్లాడారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం కృషిచేస్తానని ఆయన వివరించారు. అలాగే రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిశానని ఆయన తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఎన్.రాంచందర్‌రావును బీజేపీ బాగ్ అంబర్‌పేట డివిజన్ మాజీ అధ్యక్షుడు చుక్క జగన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అడపా చంద్రమౌళి ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దత్తు ముదిరాజ్, మల్లారెడ్డి, ఆంజనేయులు, విజయశేఖర్, రమేష్, షరీఫ్, రాజు, శ్రీనివాస్, చిట్టిబాబు, భాస్కర్, బాలకృష్ణగౌడ్, రవీందర్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు. - రాంనగర్

కనులపండువగా శ్రీనివాస కల్యాణం

చిక్కడపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి తొలి ఏకాదశి సందర్భంగా శ్రీనివాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. జవహర్‌నగర్ విజయ మెడికల్ స్టోర్స్ అధినేత, చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం మాజీ అధ్యక్షుడు శ్రీరాంపండరి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఆర్యవైశ్య మహిళాసంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆంధ్రమహిళాసభ ఫైన్‌ఆర్ట్స్ సంగీత కళాశాల విద్యార్థులు భజగోవిందం భక్తి గీతాల ఆలాపన కార్యక్రమం నిర్వహించారు.

కమ్యూనిటీహాల్ పనులు త్వరలో ప్రారంభం


వివరాలు వెల్లడిస్తున్న నర్మెట మల్లేష్

చిక్కడపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఎస్ఆర్‌టీ జవహర్‌నగర్ వ్యాయామశాల, ఆటస్థలం, కల్యాణమండప పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు నర్మెట మల్లేష్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్మెట మల్లేష్ తదితర కమిటీ సభ్యులు వివరాలను వెల్లడించారు. ఏడునెలలుగా కమ్యూనిటీహాల్ రెనోవేషన్ కోసం నిధుల మంజూరుకు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ శ్రమించారన్నారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్ సహకారంతో సుమారు రూ.26లక్షల నిధులు మంజూరు చేయించారన్నారు. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకుని పనులు ప్రారంభించేందుకు కార్పొరేటర్ చర్యలు తీసుకుంటున్నారని మల్లేష్ వివరించారు. ఈ సమావేశంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, కమిటీ సభ్యులు కృష్ణ, మహేందర్, సలీమ్, శ్రీకాంత్, రాజు, మదన్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి ఘటం ఊరేగింపు



ఆషాఢ మాసం బోనాల వేడుకల్లో భాగంగా సోమవారం అంబర్‌పేట శ్రీమహంకాళి దేవాలయం ఆధ్వర్యంలో అమ్మవారి ఘటం ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, సలహాదారులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్

టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి సన్మానం



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమితులైన రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్‌ను డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌నగర్ బస్తీ నాయకులు శ్రీహరి, హనుమంతరావు, పూర్ణ, నర్సింగ్‌రావు, కుమార్, మహేందర్, నజీర్, చంద్రశేఖర్‌లు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్‌నగర్ బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి